క్లుప్తంగా

ప్రతి సమస్యకూ పరిష్కారం

- నర్సీపట్నం ఆర్డీవో జయరాం



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జరిగిన స్పందనలో 28 అర్జీలు వచ్చాయి. ఆర్డీవో హెచ్.వి.జయరాం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ వారం స్పందనకు ఎక్కువగా భూసమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి. స్పందన ఫిర్యాదులపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉన్నందున అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆర్డీవో సూచించారు. ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆయా శాఖల అధికారులు స్పందన ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు.

పిడుగుపాటుకు పశువుల పాక దగ్ధం

మాడుగుల రూరల్: పిడుగుపాటుకు పశువులు పాక దగ్ధమైంది. మండలంలో వీరవల్లి అగ్రహారంలో శానాపతి రమణకు చెందిన పశువుల పాక ఆదివారం రాత్రి దగ్ధమైంది. పిడుగు పడేటప్పుడు పశువులు లేకపోవడం వల్ల ప్రమాదం తప్పింది. జి. అగ్రహారం రహదారిలో సుంకర వారి కళ్లాల వద్ద జరిగిన ఈ ప్రమాదంలో వ్యవసాయ పనిముట్లు, యూరియా బస్తా కాలిపోయాయని బాధిత రైతు వాపోయాడు. స్థానికుల సమాచారం మేరకు మాడుగుల అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.80 వేల ఆస్తి నష్టం వాటిల్లింది.

కోనేరు ఆక్రమణలు తొలగించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు

మాకవరపాలెం: కోనేరు ఆక్రమణలు తొలగించాలంటూ ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కొండలఅగ్రహారంలో సర్వే నంబర్114–6లో కోనేరు ఆక్రమణలను తొలగించాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు అమలు చేయలేదంటూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం కోర్టు ఆదేశాలను అమలు చేయాలని చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘుచక్రవర్తి, జిల్లా అధ్యక్షుడు పులిగా మురళీ, బూరుగుపాలెం ఎంపీటీసీ సభ్యుడు రుత్తల యర్రాపాత్రుడు తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందించారు.

పేదల ఇళ్లంటే అంత అలుసా?

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ధ్వజం
- చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా చోడవరం, నర్సీపట్నంలో బైక్ ర్యాలీ, మానవహారం



వెంకన్నపాలెం నుంచి చోడవరం వరకూ బైక్ ర్యాలీ చేస్తున్న పార్టీ శ్రేణులు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇచ్చి వారికి నీడ కల్పిస్తే, అది చూసి చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ విమర్శించారు. చంద్రబాబు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ చేశారు. వెంకన్నపాలెం నుంచి చోడవరం కొత్తూరు జంక్షన్ వరకు వందలాది మోటారు సైకిళ్లతో ఐదు కిలోమీటర్ల మేర ఈ ర్యాలీ సాగింది. దారి పొడవునా చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కొత్తూరు జంక్షన్ వద్ద నాలుగు రోడ్ల జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు సమాధులకే సరిపోవని చంద్రబాబు పేదల పట్ల ఆయనకున్న గౌరవం ఎంటో ప్రజలకు అర్థమైందన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఎంత మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో సొంతిల్లు లేకుండా ఏ ఒక్కరూ ఉండకూడదనే లక్ష్యంతో ఇతర రాష్ట్రాల్లో ఇవ్వనంత మందికి ఇంటి స్థలాలు ఇచ్చారన్నారు. అది చూసి ఓర్వలేక చంద్రబాబు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, పార్టీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, బీసీ సెల్ ప్రతినిధి సూరిశెట్టి నాగదుర్గ గోవింద, పందిరి శ్రీనివాసరావు, చవితిన బాబూరావు, సీరంరెడ్డి వెంకటరమణ, దంతులూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



ఏఎల్‌పురం నుంచి బైక్ ర్యాలీకి బయలుదేరిన నాయకులు

దోపిడీ దొంగలు చంద్రబాబు, అయ్యన్న : ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: రాష్ట్రాన్ని దోచుకున్న దోపిడీ దొంగలు చంద్రబాబు, అయ్యన్నపాత్రుడని, వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని అడుగుతుంటే... ప్రజలు అమ్మ బాబోయ్ అంటున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఎద్దేవా చేశారు. పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలు సమాధి కట్టుకోవడానికి పనికి వస్తాయని టీడీపీ నాయకుడు చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నర్సీపట్నంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సాగింది. అబిద్‌సెంటర్‌లో బైక్ ర్యాలీని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు చంద్రబాబు, అయ్యన్నపాత్రుడులకు 2024లో ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేదన్నారు. అన్ని స్థానాల్లో పోటీ చేసే దమ్ము సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. ప్రజలు మరోసారి టీడీపీ నాయకులు తరిమికొడతారన్నారు. మున్సిపల్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, కౌన్సిలర్లు కోనేటి రామకృష్ణ, సిరసపల్లి నాని, టౌన్, రూరల్ పార్టీ అధ్యక్షులు ఏకా శివ, సుర్ల సత్యనారాయణ, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, పాల్గొన్నారు.

భారీగా తరలివెళ్లిన నాయకులు

గొలుగొండ: నర్సీపట్నంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీకి మద్దతుగా మండలం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఏఎల్‌పురం, గొలుగొండ, చీడిగుమ్మల, ఏటిగైరంపేట తదితర ప్రాంతాల నుంచి ర్యాలీగా వెళ్లారు.

సమస్యల పరిష్కారానికే ‘గడప గడపకు’

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సంక్షేమ పథకాల గురించి మహిళలను ఆరా తీస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల రూరల్: ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుని, వాటిని పరిష్కరించడంతోపాటు అర్హులకు సంక్షేమ పథకాలు అందించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను మీ వద్దకు పంపించారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కె.జె.పురం గ్రామ సచివాలయం –1 పరిధిలో దిబ్బవీధి, ముత్యాలమ్మ గుడి ఏరియా, కె.జె.పురం జంక్షన్ ప్రాంతంలో సోమవారం ఆయన ఇంటింటికీ వెళ్లారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారాల వల్ల దోమలు వృద్ధి చెంది ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు విన్నవించారు. దానికి డిప్యూటీ సీఎం స్పందించి మురుగు కాలువల్లో పూడికను వచ్చే నెల 15వ తేదీ లోపు తీయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పింఛనుకు నోచుకోని దివ్యాంగురాలు మెల్లేటి వెంకటలక్ష్మికి సదరం ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని వైద్యాధికారికి సూచించారు. 1వ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. బుంగవాని చెరువు వివరాలు తహసీల్దారును అడిగి తెలుసుకున్నారు. అర్హులకు ఇంటి స్థలం, స్కీమ్‌లో చేర్చాలని ఏఈని ఆదేశించారు. కె.జె.పురం జంక్షన్‌లో జగనన్న లేఅవుట్‌లో 8 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

పలువురికి నగదు అందజేత

వృద్ధురాళ్లు సూరిశెట్టి అచ్చియ్యమ్మ, పేలూరి రాములమ్మలకు రూ.2 వేల చొప్పున సాయం అందజేశారు. కె.జె.పురం జంక్షన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న పడిమి శ్రీనివాసరావుకు రూ.5 వేలు, మరో ముగ్గురికి రూ.2 వేల చొప్పున అందించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ కిముదు రమణమ్మ, సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, నాయకులు ఆదారి కన్నారావు, మళ్ల కన్నబాబు, కాళ్ల జగన్, కాళ్ల అమ్మతల్లినాయుడు మాస్టర్, భీశెట్టి జగ్గప్పారావు, సూరిశెట్టి అచ్చిమినాయుడు, యల్లపు శ్రీనివాసరావు, ఆదారి శంకర్, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఇవ్వడమే లక్ష్యం

- వెంకన్నపాలెంలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



వెంకన్నపాలెంలో మహిళలతో మాట్లాడతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందివ్వడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వెంకన్నపాలెంలో ఆయన సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ కారణాలతో పింఛన్లు రానివారు కొందరు తమ సమస్యలను మొరపెట్టుకోవడంతో త్వరలో వారికి పింఛన్లు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి తాము పొందుతున్న పథకాలు, ఆర్థిక భరోసాపై మహిళలు, స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ మొల్లి సోమునాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వారికి సూచించారు. అమ్మఒడి, నాడునేడు ద్వారా పాఠశాల అభివృద్ధి చేసి వెంకన్నపాలెంలో విద్యా ప్రమాణాలు మరింత పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో చైతన్య, పంచాయతీరాజ్ డీఈఈ ప్రసాద్, మాజీ ఎంపీటీసీ పిల్లల గోవింద, సచివాలయ కన్వీనర్ నంబారు శ్రీనువాసరావు, ఉప సర్పంచ్ సింహాచలం నాయుడు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, జిల్లా ప్రతినిధి పల్లా నర్సింగరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంపిణీకి పాఠ్య పుస్తకాలు సిద్ధం



పాఠ్యపుస్తకాల లెక్క చూసుకుంటున్న ఎకౌంటెంట్ శ్రీనివాసరావు

రోలుగుంట: మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఎంఈవో తెలిపారు. అన్ని పాఠశాలలకు ఒకటి నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు మీడియంకు 32 వేలు ప్రతిపాదించగా, తొలుత 9 వేలు వేలు, తర్వాత 6 వేలు వెరసి 15 వేలు వచ్చాయన్నారు. వాటిని అకౌంటెంటు శ్రీనివాసరావు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చేరవేసి, వాటిని లెక్క చూసుకున్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే వస్తున్నాం

‘గడపగడపకు మన ప్రభుత్వం’లో ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



సుభద్రయ్యపాలెంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గడపగడపకు తిరుగుతున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ తెలిపారు. మండలంలోని సుభద్రయ్యపాలెం, జి.నగరంలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ఏ ఇంటికి ఎంతమేర పథకాల రూపంలో లబ్ధి చేకూర్చిందో వివరించారు. వారిపేరున ముద్రించిన బ్రోచర్లను అందజేశారు. పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలపై ఆరాతీశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించడంతోపాటు అర్హులకు పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, పార్టీ జిల్లా కార్యదర్శులు చిటికెల రమణ, బొడ్డు గోవిందరావు, నాయకులు భద్రాచలం, స్థానిక నాయకులు బండారు గంగరాజు, గాంధీ, కళ్యాణం, గోవింద, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో గడప గడపకు

వి.బి.అగ్రహారం, మాసయ్యపేట గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గణేష్ నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు. పార్టీ శ్రేణులంతా విధిగా హాజరు కావాలన్నారు.

నాతవరంలో కేక్ కటింగ్

సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాతవరంలో ఎమ్మెల్యే గణేష్ కేక్ కటింగ్ చేస్తారని తెలిపారు.

విధిగా సివిల్ రైట్స్ డే

నర్సీపట్నం: మండల స్థాయి అధికారులు విధిగా సివిల్ రైట్స్ డేను నిర్వహించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులకు సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సబ్ డివిజనల్ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ ఆర్డీవో మాట్లాడుతూ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్‌హెచ్‌వోలతో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు గ్రామాల్లో క్రమం తప్పకుండా సివిల్ రైట్స్ డే నిర్వహించి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఎలాంటి వివక్షకు తావులేకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కమిటీలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో ఎం.శ్యామల, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్ల సమస్యలపై వినతి

చోడవరం రూరల్: పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శానిటేషన్ వర్కర్ల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. సోమవారం ఎంఈవో సిహెచ్.రవీంద్రబాబుకు వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం విధానం అమలు చేయాలన్నారు. వారికి సెలవులు ఇవ్వాలని, యూనిఫామ్‌లు, గ్లౌజులు అందచేయాలన్నారు. శానిటేషన్ వర్కర్లు నర్సయ్యమ్మ, రమణమ్మ, చిన్నమ్మలు, వి.బాల, సంతోషి, దేవి, కుమారి పాల్గొన్నారు.

భూసర్వేతో రెవెన్యూ సమస్యల పరిష్కారం

- మేడిచర్ల గ్రామసభలో తహసీల్దారు రమేష్‌బాబు



మేడిచర్ల గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు

కె.కోటపాడు: పారదర్శకంగా నిర్వహించే జగనన్న శాశ్వత భూహక్కు–భూసర్వే కార్యక్రమానికి రైతులంతా సహకరించాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. భూసర్వే కార్యక్రమంపై సోమవారం మేడిచర్ల గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో 1,600 ఎకరాలకు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే బృందాలకు రైతులు భూములను చూపించడంతోపాటు ఆధార్, పాస్‌పోర్టు ఫొటో, పాస్‌బుక్ జెరాక్స్, బ్యాంక్ ఖాతాల నంబర్లు ఇవ్వాలని సూచించారు. భూసర్వేతో భావితరాలకు ఎటువంటి రెవెన్యూ సంబంధిత ఇబ్బందులు ఉండవని తెలిపారు. మండలంలో మొదటి విడతలో ఏడు గ్రామాల్లోను, రెండో విడత 16 గ్రామాల్లోను సర్వేచేయగా, మూడో విడతలో మిగిలిన గ్రామాల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వీఆర్వో జగదీష్, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిరెడ్డి వెంకటరావు, రైవాడ ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు పాల్గొన్నారు.

రికార్డుల్లో సమాచారం సమగ్రంగా ఉండాలి

రోలుగుంట: అధికారుల సమాచారం కోసం రికార్డుల్లో వివరాలు సమగ్రంగా ఉండాలని రోలుగుంట ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పెట్ల సత్యవతి, బుచ్చింపేట సెక్టార్ సూపర్‌వైజర్ అపరంజని తెలిపారు. రోలుగుంట ఎంపీపీ పాఠశాలలో రోలుగుంట సెక్టార్ పరిధి వర్కర్లకు, బుచ్చింపేట సెక్టార్ పరిధి వర్కర్లకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం సమావేశాలు నిర్వహించారు. సంపూర్ణ పోషకాహారం పంపిణీ, లబ్ధిదారుల ఆరోగ్య రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.

6న దేవరాపల్లిలో సన్యాసమ్మ తల్లి పండగ

- గోడపత్రికను విడుదల చేసిన డిప్యూటీ సీఎం బూడి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం

దేవరాపల్లి: స్థానిక సన్యాసమ్మ అమ్మవారి పెద్ద పండగను వచ్చే నెల 6న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పండగ సందర్భంగా స్థానిక రైవాడ జలాశయం అతిథి గృహం వద్ద గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం గోడపత్రికను విడుదల చేశారు. 12 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న పండగకు హాజరు కావాలని ఆయన్ను కమిటీ సభ్యులు కోరారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, గండిపడాల అప్పలరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి



నాతవరం: స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1995–96వ బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎక్కడెక్కడో దూరప్రాంతాల్లో ఉద్యోగ రీత్యా స్థిర పడిన వారంతా చేరుకుని ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని మురిసిపోయారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తోటి పేద విద్యార్థులను ఆర్థిక సాయం చేయాలని తీర్మానించారు.

భజన భక్తులకు చీరల పంపిణీ

నాతవరం: అంకంరెడ్డి జమీల్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కోటమ్మతల్లి భజన భక్తులకు చీరలు పంపిణీ చేశారు. 21 మందికి వీటిని జమీల్ కుటుంబ సభ్యులు అందజేశారు. గ్రామంలో వృద్ధులకు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ కరక రేణుక, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, విశ్రాంతి సూపరింటెండెంట్ అంకంరెడ్డి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.